

నన్నయ్య విసిగా ప్రసన్నశ్రీ నియామకం



రాజానగరం : ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ విసిగా సత్తుపాటి ప్రసన్నశ్రీని నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె ప్రస్తుతం ఆంధ్ర విశ్వవిద్యాలయంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇంగ్లీష్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అంతరించిపోతున్న గిరిజన భాష కోసం భగత, గదబ, కొలామి, కొండ దొర తదితర 19 గిరిజన భాషలకు లిపి రూపొందించిన తొలి మహిళగా ప్రసన్నశ్రీ గుర్తింపు పొందారు. 2022 అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అప్పటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నుంచి నారీశక్తి పురస్కారం అందుకున్నారు. 125 పరిశోధనలకు చేసిన సేవలకు బెస్ట్ టీచర్ అవార్డ్స్, బెస్ట్ ఉమెన్ స్పీకర్ అవార్డు, గిరిజన అరక బ్రహ్మ, దళిత సాహిత్య అకాడమి అవార్డు, ఉమెన్ అచీవర్స్ అవార్డు, ఇండియన్ ఇండిగేనోస్ స్క్రిప్టేర్ అవార్డులను ఆమె పొందారు.

తునిలో అమీతుమీ...

- వైస్ ఛైర్మన్ ఎన్నికపై కొనసాగుతున్న ఉత్కంఠ
- భారీగా చేరుకున్న టిడిపి, వైసిపి శ్రేణులు
- ఉద్రిక్తత పరిస్థితులు నడుమ లాఠీలకు పని చెప్పిన పోలీసులు
- నాలుగో సారి వాయిదా వేసిన అధికారులు



లాఠీఛార్జి చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి, కోటనందూరు

తునిలో అమీతుమీ తేల్చుకునేందుకు వైసిపి, టిడపి శ్రేణులు సిద్ధపడంతో ఉద్రిక్తత నెలకింది. మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఎన్నిక నేపథ్యంలో గత రెండు రోజులుగా తునిలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. టిడిపి, వైసిపి శ్రేణుల మధ్య తీవ్ర వివాదం చోటుచేసుకోవడంతో అక్కడ టెన్షన్ వాతావరణం ఏర్పడింది. తుని మున్సిపల్ కౌన్సిలర్లు 30 మందికి ఒకరు మృతి చెందగా మరొకరు ఉద్యోగం వచ్చి వెళ్లిపోయారు. ఇక 28 మంది మిగిలారు. ఇందులో ఇటీవలే 10 మంది టిడిపి కండువా కప్పుకున్నారు. మిగిలిన 18 మంది వైసిపిలోనే ఉన్నారు. ఈ నేపథ్యంలో వైస్ ఛైర్మన్ ఎన్నిక కోసం ఈనెల 3,4 తేదీలలో సమావేశాన్ని నిర్వహించారు. కోరం లేక రెండు సార్లు వాయిదా పడింది. తాజాగే ఈ నెల 17న వైస్ ఛైర్మన్ ఎన్నిక నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. వైసిపి కౌన్సిలర్లను టిడిపి శ్రేణులు అడ్డుకున్నాయి. దీంతో కోరం లేక ఎన్నిక మళ్లీ నిలిచింది. మంగళవారం మరోసారి నిర్వహించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో ఎటువంటి ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడకుండా పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎన్నిక కోసం 10 మంది టిడిపి కౌన్సిలర్లు సమావేశానికి హాజరు కాగా వైసిపి కౌన్సిలర్లు ఎవరూ రాలేదు. కౌన్సిలర్లను రాకుండా వైసిపి అడ్డుకోవడం సరికాదంటూ ఈ సందర్భంగా టిడిపి శ్రేణులు నిరసనకు దిగారు. వారు వస్తే టిడిపికి మొగ్గు చూపుతారనే భయంతో వైసిపి కౌన్సిలర్లను చైర్మన్ నివాసంలో దాచేశారన్నారు. ఈ నేపథ్యంలోనే టిడిపి శ్రేణులు పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను దోసుకుంటూ వైసిపి కౌన్సిలర్లను దాచిన ప్రాంతానికి వెళ్లే ప్రయత్నం చేశారు. ఎన్నిక జరగకుండా వైసిపి అడ్డుకోవడంపై ఆందోళన చేపట్టారు. ఎన్నిక జరిగితే ఓడిపోతామనే భయంతో కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తుందని, అందుకే ఎన్నికకు హాజరు కాకుండా తమ కౌన్సెలర్లను అడ్డుకుంటున్నారని వైసిపి నేతలు అంటున్నారు.



గొల్లప్రోలు టోల్‌ప్లాజా వద్ద బైటాయించిన వైసిపి మాజీ ఎంఎల్‌ఎలు

ఆందోళనకారులు ఎవరూ మున్సిపల్ కార్యాలయం వైపు రాకుండా 100 మీటర్ల దూరం నుంచి పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేశారు. టిడిపి, వైసిపి నాయకులు, కార్యకర్తలు మున్సిపల్ కార్యాలయం వద్దకు పెద్ద ఎత్తున రావడంతో ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను కార్యకర్తలు నెట్టివేశారు. దాంతో పోలీసులు లాఠీలకు పని చెప్పాల్సి వచ్చింది. కార్యకర్తలను చెదరగొట్టేందుకు లాటి ఛార్జ్ జరగడంతో మరింత ఉద్రిక్తత ఏర్పడింది. దాదాపు 500 మంది వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన టిడిపి, వైసిపి కార్యకర్తలు తమ తమ నేతలకు అనుకూలంగా నినాదాలు చేశారు. పోలీసులు చెదరగొట్టిన తర్వాత దూరంగా వెళ్లిపోయారు.

మరోసారి వాయిదా

తుని మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక వరుసగా నాలుగోసారి వాయిదా పడింది. కోరం లేకపోవడంతో వాయిదా వేస్తున్నట్టు ప్రిసైడింగ్ ఆఫీసర్ రవికుమార్ తెలిపారు.కోరం ఉండాలంటే 15 మంది అవసరమని మంగళవారం 10 మంది మాత్రమే హాజరు కావడంతో వాయిదా వేశామన్నారు. ఇక్కడి పరిణామాలను రాష్ట్ర ఎన్నికల కమిషన్, కలెక్టర్‌కు తెలియజేశామన్నారు.

'చలో తుని' అడ్డగింత

మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక నేపథ్యంలో సోమవారం జరిగిన పరిణామాలను దష్టిలో పెట్టుకుని మాజీ మంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా 'చలో తుని' కార్యక్రమానికి పిలుపునిచ్చారు. దీంతో జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున వైసిపి శ్రేణులు తునికి పయనమయ్యారు. పోలీసులు వారికి ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. జక్కంపూడి రాజా, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణలను హౌస్ అరెస్ట్ చేశారు. ముద్రగడ్డ పద్మనాభం తుని బయలుదేరగా పోలీసులు అడ్డుకుఅన్నరు. తునికి చేరుకున్న మాజీ ఎంఎల్ఎ వంగా గీతను కారులో అనుచరులతో వెళుతుండగా అడ్డుకున్నారు. గొల్లప్రోలు చెక్ పోస్టు వద్ద కురసాల కన్నబాబు, ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి, అనంతబాబులను నిలిపివేసారు. దీంతో వారు అక్కడకే బైటాయించి నిరసన తెలిపారు.

గర్భవతిని అని కూడా చూడకుండా పరిగెత్తించారు

వైస్ చైర్మన్ ఎన్నికల్లో పాల్గొనేందుకు మున్సిపల్ కార్యాలయానికి వెళ్తుండగా టిడిపి శ్రేణులు తరిమారు. దొరికినోళ్లను దొరికినట్లుగానే కిడ్నాప్ చేయడానికి ప్రయత్నించారు. తాను గర్భవతి అని కూడా చూడకుండా ఓటు వేయడానికి వెళ్లనీయకుండా అడ్డుకున్నారు. తన తల్లిదండ్రులను చూసి రెండు రోజులు అయిందని రెండో వార్డు వైసీపీ కౌన్సిలర్ చింతల సునీత మీడియా ముందు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిణామాలు అనంతరం మాజీమంత్రి దాడిశెట్టి రాజా వైసిపి కార్యాలయంలో తన అనుచరులతో సమావేశం అయ్యారు. వైసిపి కౌన్సిలర్లను కిడ్నాప్ చేసి తమ వైపునకు తిప్పుకునే ప్రయత్నం చేశారని టిడిపి నేతలపై ఆరోపణ గుప్పించారు. కౌన్సిలర్లను భయపెట్టి, ప్రలోభపెట్టాలని చూస్తే సహించేది లేదంటూ హెచ్చరించారు.



సభలో మాట్లాడుతున్న అరుణ్

చిరస్మరణీయులు బాలాజీదాస్, బిబి.నాయుడు

సిపిఎం జిల్లా కార్యదర్శి అరుణ్

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ప్రజా సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు నడిపిన జిఎస్.బాలాజీదాస్, బిబి.నాయుడు చిరస్మరణీయులని సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ అన్నారు. జిఎస్ బాలాజీ దాస్ 22వ వర్ధంతి, బిబి.నాయుడు 8వ వర్ధంతి పురస్కరించుకుని ఎపి పేపరుమిల్లు పరిశ్రమ సమీపంలోని బిటికె భవన్‌లో మంగళవారం సాయంత్రం కార్మిక సభ నిర్వహించారు. తొలుత వారి చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు సిపిఎం నగర కార్యదర్శి కర్రి రామకృష్ణ అధ్యక్షత వహించారు. ముఖ్యవక్తగా అరుణ్ పాల్గొని మాట్లాడారు. బాలాజీదాస్ విద్యార్థి దశ నుంచి స్వాతంత్ర్య ఉద్యమంలో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా తన ఉద్యమ ప్రస్థానం ప్రారంభించారన్నారు. ఆ కాలంలోనే రాజమండ్రి సెంట్రల్ జైలులో శిక్షను అనుభవించారని తెలిపారు. స్వాతంత్ర్యానంతరం శ్రామికుల పక్షాన ప్రజాపోరాటాలు నిర్వహిస్తూ కమ్యూనిస్టు ఉద్యమంలో కీలక పాత్ర పోషించారన్నారు. రాజమండ్రిలో నిర్వహించిన సిఐటియు తొలి రాష్ట్ర మహాసభకు నాయకత్వం వహించారని, ఆ మహాసభలో రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారని తెలిపారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శిగా విశేష సేవలందరించారని తెలిపారు. బాలాజీ దాస్ జీవితం చివరి వరకూ కార్మిక పోరాటాలలో క్రియాశీలకంగా పనిచేశారని తెలిపారు. బిబి నాయుడు పేపరు మిల్లులో సాధారణ కార్మికునిగా జీవిత ప్రస్తానం ప్రారంభించి సిఐటియు రాష్ట్ర స్థాయి నాయకునిగా



బాలాజీదాస్‌కు నివాళులర్పిస్తున్న అరుణ్

ఎన్నికయ్యారని తెలిపారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పరిశ్రమలలో పనిచేసే కార్మికుల పోరాటాలకు దిశానిర్దేశం చేశారని గుర్తు చేశాయి. కడియం, రాజమండ్రి పేపరు మిల్లులు, ఒఎన్‌జిసి కాంట్రాక్టు కార్మికుల ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జె.రాంబాబు మాట్లాడుతూ బాలాజీదాస్, బిబి నాయుడు స్ఫూర్తితో కార్మిక ఉద్యమాలు మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలకు తూట్లు పొడుస్తుందని వివరించారు. సీనియర్ నాయకులు టి.సావిత్రి మాట్లాడుతూ కార్మిక చట్టాలను లేబర్ కోడ్‌లుగా మార్చేందుకు మోడీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకోవాలని, ఆ దిశగా పోరాటాలను తీవ్రతరం చేయటమే జిఎస్ బాలాజీదాస్, బిబి నాయుడులకు నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి. పవన్, టి తులసి, తాతారావు, పేపరుమిల్లు యూనియన్ నాయకులు రాము, సోమేశ్వరరావు, కాంతారావు, ఇతర నాయకులు మాతారావు, జరీనా, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమక్షంలోనే రీసర్వే

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

రైతుల సమక్షంలోనే భూముల రీ సర్వే నిర్వహిస్తామని తహశీల్దార్ పిఎన్‌డి.ప్రసాద్ తెలిపారు. రీ సర్వే పైలట్ ప్రాజెక్ట్ గ్రామంగా ఎంపికైన సత్యవాడలోని ప్రధాన రహదారిపై మంగళవారం రీ సర్వేపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ గతంలో నిర్వహించిన రీ సర్వేలో ఏవైనా లోపాలుంటే సరిచేసుకునే వీలుందన్నారు. రోవర్ సహాయంతో గ్రౌండ్ ట్రూతింగ్ రీసర్వే సిబ్బందికి రైతులు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమం ఈనెల 27తో ముగుస్తుందని, అనంతరం గ్రౌండ్ వ్యాలిడేషన్ ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ రీసర్వే ద్వారా సమస్యలు పరిష్కరించుకుంటే భవిష్యత్తులో రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండబోదన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు, వడ్లూరు విఆర్‌ఒ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాలపై సమావేశం

ప్రజాశక్తి - సీతానగరం

మంగళవారం సీతానగరం మండలంలోని ఎంపిడిఒ కార్యాలయంలో శివరాత్రి ఉత్సవాలు సందర్భంగా పట్టిసీమ ఏర్పాట్లకు సంబంధించి ఉత్సవ కమిటీలు, కూటమి నాయకులు సమీక్షా సమావేశం నిర్వహించారు. రుడా ఛైర్మన్, టిడిపి రాజానగరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొడ్డు వెంకటరమణచౌదరి, రాజనగరం ఎంఎల్‌ఎ బత్తుల బలరామకృష్ణ తదితరులతో చర్చించారు. ఏర్పాట్లు, తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు.

టిబి ముక్త్ పంచాయతీ క్లెయిమ్స్ వెరిఫికేషన్ ప్రారంభం

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

టిబి ముక్త్ పంచాయతీ క్లెయిమ్స్ వెరిఫికేషన్ ప్రోసెస్ మంగళవారం ప్రారంభమైంది. జిల్లా వైద్యాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ ఎన్.వసుంధర, జిల్లా పంచాయతీ అధికారి వి.శాంతిమణి, ప్రభుత్వ మెడికల్ కాలేజీ కమ్యూనిటీ మెడిసిన్ విభాగం నుంచి డాక్టర్ సురేంద్ర, ఐఎంఎ నుంచి డాక్టర్ వై.గురుప్రసాద్ హాజరయ్యారు. ఈ బృందం క్లెయిమ్స్‌ను వెరిఫికేషన్ చేసే సమయంలో ఆయా పంచాయతీల్లో పర్యటిస్తుంది. పంచాయతీ ప్రెసిడెంట్, గ్రామ పంచాయతీ కార్యదర్శి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్, సిబ్బంది, టిబి సూపర్ వైజర్, టిబి ల్యాబ్ సూపర్ వైజర్ పాల్గొనాల్సి



వెరిఫికేషన్ చేస్తున్న బృందం సభ్యులు

ఉంటుందన్నారు. 2023వ సంవత్సరానికి తూర్పు గోదావరి జిల్లా నుంచి 109 పంచాయతీలు టీబీ ముక్త్ పంచాయతీలకు క్లెయిమ్స్ సమర్పించాయి. అన్నీ క్లెయిమ్స్ పరిశీలించిన తరువాత అన్ని 109 పంచాయతీలు బ్రాంజ్ మెడల్‌ను అందుకున్నాయన్నారు. 2024వ సంవత్సరానికి తూర్పు గోదావరి జిల్లా నుంచి 107 పంచాయతీలు టీబీ ముక్త్ పంచాయతీలకు క్లెయిమ్స్ సమర్పించాయి . వీటిలో 77 సిల్వర్ మెడల్ కోసం, 29 బ్రాంజ్ మెడల్ కోసం పోటీపడుతున్నాయి. ఈ 107 పంచాయతీల క్లెయిమ్స్‌ను జిల్లా బృందం, 12 ఇతర బృందాలు క్షుణ్ణంగా పరిశీలించి దరఖాస్తులను సెంట్రల్ టీబీ డివిజన్ కు పంపించనున్నాయి. ఈ పరిశీలనకు ఆన్‌లైన్‌లో సబ్‌మిట్ చేసేందుకు మార్చి 10 చివరితేదీ.

రేవులు ఇలా? మరి పుణ్యస్నానాలెలా?

ప్రజాశక్తి - కడియం

హిందువులకు ముఖ్యమైన పండుగల్లో మహా శివరాత్రి ఒకటి. ఆ రోజున భక్తులు తెల్లవారుజామున పుణ్యస్నానాలు ఆచరించి శివుడికి అభిషేకాలు, పూజలు చేస్తారు. అయితే పలు కాలువ రేవులలో తీరని పలు సమస్యలు దర్శనమిస్తున్నాయి. మహిళలు స్నానాలు ఆచరించేందుకు సరైన సౌకర్యాలు లేక, దుస్తులు మార్చుకునే గదులు లేక ఉన్నా వినియోగంలో లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కడియం మండలంలో వేమగిరి నుంచి జేగురుపాడు వరకూ, అలాగే వేమగిరి నుంచి పొట్టిలంక వరకూ పెద్ద కాలువల వెంబడి పదుల సంఖ్యలో స్నానాల రేవులున్నాయి. నిత్యం ప్రజలు కార్యకలాపాలు కొనసాగించే కొన్ని రేవులు తప్ప మిగిలినవన్నీ చెత్త, చెదారాలతో దుర్గంధ భరితంగా తయారయ్యాయి.. తీవ్ర దుర్వాసనలు వెదజల్లుతున్నాయి. మరికొన్ని బురద మయమై ప్రమాదకరంగా మారాయి.



కడియపులంకలో పెద్ద కాలువ స్నానాల రేవు దుస్థితి

స్నానాలరేవులను పర్యవేక్షిస్తూ, పరిశుభ్రం చేయిస్తూ, పరిరక్షించాల్సిన ఆయా పంచాయతీల కార్యదర్శులు, సర్పంచ్‌లు పట్టించుకోకపోవడమే ఈ దుస్థితికి కారణమని పలువురు బాహాటంగా విమర్శిస్తున్నారు. మహాశివరాత్రి సమీపిస్తున్న తరుణంలో రేవులన్నీ శుభ్రం చేయించాలని, వద్ధులు వికలాంగులు చిన్న పిల్లలు సైతం స్నానాలు ఆచరించే విధంగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని భక్తులు కోరుతున్నారు.

పెండింగ్ ఫైల్స్, రీ ఒపెన్ అర్జీల పరిశీలన

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో పెండింగ్ ఫైల్స్, రీ ఓపెన్ అర్జీలను జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు ఆధ్వర్యంలో కలెక్టర్ ప్రశాంతి మంగళవారం పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ, భూ అనుబంధ సంబంధ అర్జీల పరిష్కారం విషయంలో తప్పనిసరిగా జవాబుదారీతనం కలిగి ఉండాలని స్పష్టం చేశారు. డివిజన్ పరిధిలో రీ ఓపెన్ అయిన పిజిఆర్‌ఎస్ అర్జీల పరిష్కారం, రీ సర్వే అభ్యంతరాలు లేకుండా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. సంబంధించిన సర్వే వివరాలను హేతుబద్ధత కలిగి పరిష్కారం చేయాలని ఆదేశించారు. ఈ విషయంలో ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. అర్జీలను పరిష్కారం చేసే ప్రక్రియలో నిజ నిర్ధారణ, ప్రామాణిక పత్రాలు పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. మ్యుటేషన్, కో-రిలేషన్, రీ సర్వే తదితర అంశాలకు సంబంధించి 60 కేసులను పరిష్కరించి ధ్రువపత్రాలు కలెక్టర్, జాయింట్ కలెక్టర్ చేతుల మీదుగా అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ ఆర్.కృష్ణనాయక్, డిప్యూటీ సర్వేయర్ వై.మోహన్‌రావు, డిటి తదితరులు పాల్గొన్నారు.

జిబిఎస్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

గుయ్లైన్ బారో సిండ్రోమ్ (జిబిఎస్) పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వ్యాధి లక్షణాలు కనిపించగానే అశ్రద్ధ చేయకుండా వైద్యులను సంప్రదించాలని రాజమహేంద్రవరం సిటీ ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్ సూచించారు. మంగళవారం ఆయన ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. జిబిఎస్‌కు ముందస్తు జాగ్రత్త చర్యలపై వైద్యులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 16 కేసులు నమోదు అయ్యాయని, రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో 2 కేసులు వస్తే పరీక్షల కోసం కాకినాడ పంపించారని చెప్పారు. జిబిఎస్ బాధితుల కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో ఐసోలేషన్ ఏర్పాటు చేశారని, తెలిపారు. అవసరమైన మందులు, ఇంజక్షన్లు సిద్ధంగా ఉంచారని తెలిపారు. ఒక పేషెంటుకు ఐదు రోజులపాటు ఐదు ఇంజెక్షన్లు ఇవ్వాల్సి ఉంటుందని, బయట ఈ ఇంజెక్షన్ ఖరీదు రూ. 20 వేల వరకు ఉంటుందని చెప్పారు. ప్రభుత్వాసుపత్రిలో దీనిని ఉచితంగా చేస్తారని తెలిపారు. ఆయన వెంట టిడిపి రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, టిడిపి నగర ఉపాధ్యక్షులు ఉప్పులూరి జానకి రామయ్య, మరుకుర్తి రవి యాదవ్, ఆసుపత్రి కమిటీ సభ్యులు ఉన్నారు.

పేపరు మిల్లు కార్మికులు ఆందోళన

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం


పేపరుమిల్లు పరిశ్రమ కార్యాలయం ఎదుట కార్మికులు బైఠాయించి ఆందోళనచేపట్టారు. పరంపర స్కీములో జరిగిన ఒప్పందాల ఫలితంగా కార్మికులు గత కొన్ని రోజులుగా పేపరుమిల్లులో నిరసన తెలుపుతున్న విషయం విధితమే. తాజాగా మంగళవారం రాత్రి పరిశ్రమ గేటు లోపల పెట్రోల్ బాటిల్ చేత పట్టుకుని ఆందోళన కొనసాగించారు. యాజమాన్యం తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

రైతుకు గుర్తింపు సంఖ్య తప్పనిసరి

ప్రజాశక్తి - గోపాలపురం

ప్రతి రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరిగా ఉండాలని ఎఒ బి.రాజారావు తెలిపారు. మంగళవారం మండలంలోని దొండపూడి, రాజంపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు పొందాలంటే గుర్తింపు సంఖ్య తప్పనిసరి అన్నారు. రైతులు వారి ఆధార్ కార్డు, పొలం వివరాలను సమీపంలోని రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ సహాయకులకు ఇచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఆధార్ లింకు అయిన మొబైల్ నెంబర్‌ను తీసుకెళ్లాలన్నారు. పీఎం కిసాన్‌కు సంబంధించిన 19వ విడత నిధులు జమ కావడానికి కూడా ఈ రిజిస్ట్రేషన్ తప్పనిసరి అన్నారు. మార్చి 25లోగా దీన్ని చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు మరియు వ్యవసాయ ఉద్యాన సిబ్బంది మంగతాయారు, బిందు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



అంగన్‌వాడీకు జ్ఞానజ్యోతి శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి - యంత్రాంగం

అంగన్‌వాడీలకు జ్ఞాన జ్యోతి శిక్షణా తరగతులు జిల్లా వ్యాప్తంగా మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఆయా ప్రాంతాల్లో విద్యాశాఖ అధికారులు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. **రాజమహేంద్రవరం** అర్బన్ ప్రాజెక్ట్ పరిధిలోగల అంగన్‌వాడీ కార్యకర్తల 120 రోజుల సర్టిఫికెట్ కోర్స్ జ్ఞాన జ్యోతి 6 రోజుల శిక్షణ కార్యక్రమం రాజమహేంద్రవరం నన్నయ్య హై స్కూల్లో మంగళవారం ప్రారంభమైంది. విద్యార్థుల అభ్యాసన నాణ్యతను మెరుగుపరచడం కోసం, ఐదేళ్లలోపు పిల్లల్లో సమగ్ర అభివృద్ధిని



గోకవరంలో...

పెంపొందించడం కోసం అవగాహన కల్పిస్తున్నారు. ఈ శిక్షణ అంగన్‌వాడీకేంద్రాలను బలోపేతం చేయడానికి ఉపయోగపడుతుందని సమగ్ర శిశు అభివృద్ధి సేవ పథకపు అధికారి సిహెచ్‌వి.నర్సమ్మ తెలిపారు. **రాజమహేంద్రవరం రూరల్** ధవళేశ్వరంలోని కస్తూర్బా గాంధీ బాలికోన్నత పాఠశాలలో ఎంఇఒ తులసీదాస్ జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణను ప్రారంభించారు..పిల్లల సమగ్ర అభివృద్ధికి, అభ్యాసన నైపుణ్యాలు పెంపొందించుకోవడం కోసం ఈ శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. మొత్తం 126 మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణను ఇవ్వడానికి ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు ఆర్.బేబీరాణి, శిరీష, ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ నుంచి రమేష్, త్రివేణి డిఆర్‌పిలుగా గా వ్యవహరిస్తున్నారని తెలిపారు. **చాగల్లు** జిల్లా పరిషత్ హై స్కూల్లో శిక్షణను ఎంఇఒ యు.గురునాథం ప్రారంభించారు. 54 మంది అంగన్‌వాడీలు హాజరయ్యారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు పద్మావతి, శిరీష, విద్యాశాఖ నుంచి పిల్లి శ్రీనివాసమూర్తి, జె.నాగరాటాలు, విజవి.సుబ్బలక్ష్మి డిఆర్‌పిలుగా వ్యవహరిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కోఆర్డినేటర్ సమగ్ర శిక్ష ఎఎస్ఒ వైవి.ప్రసాద్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ-2 సుభాకర్, హెచ్‌ఎం మోహన్‌కృష్ణ, సిఆర్‌పిలు, అకౌంటెంట్ హాజరయ్యారు. **ఉండ్రాజవరం** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తహశీల్దార్ పిఎన్‌డి.ప్రసాద్, ఎంపిడిఒ వివివిఎస్.రామారావు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కోర్స్ డైరెక్టర్లుగా ఎంఇఒ-1 సిహెచ్.సక్సేనారాజు, హెచ్‌ఎం కె.మాణిక్యాలరావు, సిడిపిఒ శ్రీలక్ష్మి వ్యవహరించారు. డిఆర్‌పిలుగా కాశీ విశ్వనాథం, తమ్మిశెట్టి శ్రీనివాసు, ఎం.తిరుపతిరావు, సూపర్‌వైజర్లు ఎం.భాగ్యలక్ష్మి, ఎం.బాల సరస్వతి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు. **గోకవరం** జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం అంగన్‌వాడీలకు శిక్షణ ప్రారంభించారు. ఎంఇఒ బి.గౌరమ్మ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ ఎసిడిపిఒ పి.వరలక్ష్మి, సూపవైజర్లు పి.ఇందిరారాణి, ఎల్.రంజిని, పి.చంద్రమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **పెరవలి** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమం తహశీల్దార్ డి.అచ్యుత కుమారి మంగళవారం ప్రారంభించారు. చిన్నారులకు ఆటపాటలతో విద్య నేర్పే మెలకువలను జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమం ద్వారా నేర్చుకోవాలన్నారు. ఆరు రోజులు పాటు శిక్షణ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ శ్రీలక్ష్మి, హెచ్‌ఎం ఎమ్‌డివి.ప్రసాద్, ఐసిడిసి సూపర్‌వైజర్లు లక్ష్మి, సరోజిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **దేవరపల్లి** జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీలకు



పెరవలిలో శిక్షణ ఇస్తున్న రిసోర్స్ పర్సన్లు

శిక్షణా తరగతులు ప్రారంభించారు. ఎంఇఒలు ఎం.తిరుమలదాసు, కెఆర్‌ఎస్‌వివి.అప్పారావు, హెచ్‌ఎం శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో వీటిని నిర్వహించారు. రిసోర్స్ పర్సన్స్‌గా వై.శ్రీదేవి, ఎం.మహాలక్ష్మి, కె.నీరజ, ఐసిడిఎస్ సిబ్బంది ఎం.విజయలక్ష్మి, ఎం.శశికళ, బి.విజయశాంతి వ్యవహరించారు. సిడిపిఒ నాగలక్ష్మి హాజరయ్యారు. **గోపాలపురం** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్త 6 రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కోర్స్ డైరెక్టర్ మండల విద్యాశాఖ అధికారి జి.శ్రీనివాసరావు తెలిపారు. ఐసిడిఎస్ సిడిపిఒ కె. నాగలక్ష్మి ఆధ్వర్యంలో ఈ శిక్షణ నిర్వహించారు. ఆరేళ్లలోపు పిల్లల సమగ్ర అభివృద్ధికి ఈ శిక్షణ దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు జెవి.రమణ, కె.విజయ్‌కుమారి, రిసోర్స్ పర్సన్స్ మెరపల నాగేశ్వరరావు, ఉచ్చుల బాలాజీ, సిఆర్‌పిలు కొయ్య నాగరాజు, లక్ష్మణ్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఆటోడ్రైవర్‌పై పోక్సో కేసు నమోదు

ప్రజాశక్తి - మండపేట

మండపేట టౌన్ పరిధిలో బాలికపై అత్యాచారం ఘటనపై టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. మండపేటకు చెందిన బాలిక పదో తరగతి చదువుతుంది. పట్టణానికి చెందిన ఆటో డ్రైవర్ క్రాంతి కుమార్ అత్యాచారం చేసినట్టు బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై మండపేట పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక గొల్లపుంతకు చెందిన ఆటో డ్రైవర్ క్రాంతికుమార్(25)కు భార్య, కుమారుడు ఉన్నారు. సమీపంలో ఉండే పదవ తరగతి బాలికతో పరిచయం చేసుకుని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి అత్యాచారం చేసినట్లు బాలిక తల్లిదండ్రులు తెలిపారు. బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదుతో పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ సురేష్ తెలిపారు.

సారా బట్టీపై దాడి

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

మండలంలోని సొంటివారి పాకలు శివారు అరటి తోటలో నిర్వహిస్తున్న సారా బట్టీపై ఎస్ఇబి వెంకటేష్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేశారు. సారా తయారీకి ఉపయోగించే 200 లీటర్ల బెల్లపు పూటను ధ్వంసం చేశారు. 4 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. సారా తయారీ చేస్తున్న కొమ్మనబోయిన నాగేశ్వరరావును అరెస్టు చేసినట్లు ఎస్ఇ తెలిపారు.

జట్టు కార్మికుడు మృతి

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక లలిత ఇండస్ట్రీస్‌లో పని చేస్తున్న బీహార్‌కు చెందిన జట్టు కార్మికుడు షఫీర్ ఆలం (34) మంగళవారం బాత్ రూంలో స్నానం చేస్తూ మృతి చెందాడని పోలీసులు తెలిపారు. షఫీర్ ఆలం గత కొన్ని రోజులుగా పచ్చకామెర్ల వ్యాధితో బాధపడుతున్నాడన్నారు. మంగళవారం స్నానాల గదిలోకి వెళ్లి కుప్పకూలి పడిపోయి మరణించాడన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వి.మౌనిక తెలిపారు.

గాయపడిన వృద్ధురాలి మృతి

ప్రజాశక్తి - చాగల్లు

మనవడి దాడిలో గాయపడిన చాగల్లు మండలం కలవలపల్లి గ్రామానికి చెందిన జాస్తి శశిరేఖ(60) పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు రెండు నెలల క్రితం ఆట కోసం బయటకు వెళ్లి ఆలస్యంగా వచ్చిన మనవడును శశిరేఖ మందలించింది. దీంతో కోపంతో మనవడు సుత్తితో ఆమె తలపై మోదాడు. వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను ఆసుపత్రికి తరలించారు. అప్పటి నుంచి కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. పరిస్థితి విషమించడంతో మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిడదవోలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



వైద్య సేవలను పరిశీలిస్తున్న డిఎంహెచ్ఒ వెంకటేశ్వరరావు

లక్ష్యాలను చేరుకోవాలి

ప్రజాశక్తి - తాళ్లపూడి

ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే వారికి అవసరమైన అన్ని సేవలు అందిస్తూ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కె.వెంకటేశ్వరరావు సూచించారు. డిఎంహెచ్ఒ మలకపల్లి పిహెచ్‌సిని మంగళవారం సందర్శించారు. ఈ క్రమంలో అక్కడ రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించిన అనంతరం ఆసుపత్రి వైద్యులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. వైద్యసేవలపై పలు సూచనలు చేశారు. అనంతరం పెద్దేవం గ్రామంలో వైద్య శాఖ నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించారు. 18 సంవత్సరాలు నిండిన వారి ఆరోగ్య వివరాలు నమోదు చేసే సర్వే కార్యక్రమాన్ని మార్చి 31 లోపు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎసిడిసిడి జిల్లా మానిటరింగ్ అధికారి డాక్టర్ జి.హరిచంద్రప్రసాద్, డాక్టర్ ఎం.షమ్మికుమార్, మలకపల్లి వైద్యాధికారి డాక్టర్ పి.సుచందన ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ప్రశాంతంగా ఇడిఎం రాత పరీక్ష

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

తూర్పు గోదావరి జిల్లాకు చెందిన నేషనల్ ఇన్ఫర్మేటిక్ సెంటర్‌కి చెందిన ఈ-గవర్నెన్స్ డిస్ట్రిక్ట్ మేనేజర్(ఇడిఎం) కాంట్రాక్టు పోస్ట్ భర్తీ కోసం నిర్వహించిన రాత పరీక్షకు 93 మంది అభ్యర్థులు హాజరయ్యారని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. ఇడిఎం రాత పరీక్షను పరిపాలన అధికారి ఎమ్.డి.ఆలీ, సెక్షన్ సూపరింటెండెంట్ మహేశ్వరి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి.ప్రశాంతి వివరాలు తెలియజేశారు. పొరుగుసేవల కింద కాంట్రాక్ట్ పద్ధతిలో ఇడిఎం పోస్టు కోసం 115 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, వారిలో 93 మంది హాజరయ్యారన్నారు. 22 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారన్నారు.

తాళ్లపూడిలో మూడు పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

ప్రజాశక్తి - తాళ్లపూడి

ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు తాళ్లపూడి మండలంలో మూడు పోలింగ్ కేంద్రాల ఏర్పాటు చేశామని ఇన్‌ఛార్జి తహశీల్దార్ మోహనభారతి తెలిపారు. మండలంలో 1,935 మంది పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించుకోనున్నారని తెలిపారు. గణాంక అధికారి జోడాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మొత్తం ఓటర్లలో 1180 మంది పురుషులు, 755 మంది మహిళలు ఉన్నారని తెలిపారు.

'గిరిజన హక్కుల పరిరక్షణ - అమలు' పై న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

తూర్పుగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో స్టానిక్ ఆర్ట్స్ కళాశాలలో 'గిరిజన హక్కుల పరిరక్షణ -అమలు'పై మంగళవారం న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో న్యాయమూర్తి శ్రీలక్ష్మి మాట్లాడుతూ గిరిజనులకు భారత రాజ్యాంగం ద్వారా హక్కుల అందించిందన్నారు. నల్సా (గిరిజన హక్కుల రక్షణ మరియు అమలు)పథకం-2015 గురించి వివరించారు. వారు హక్కులను వినియోగించుకుని అభివృద్ధి సాధించాలన్నారు. అందుబాటులో ఉన్న పథకాలను వివరించారు. ఈ విషయంలో ఎలాంటి సహకారం కావాలన్నా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ట్రైబల్ ఆఫీసర్ కె.ఎన్.జ్యోతి, ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్ సిబ్బంది, న్యాయవాది డి.వెంకటేశ్వరరావు, పారా లీగల్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రభుత్వ బాలుర పర్యవేక్షణ గృహాన్ని, కెవి స్టేట్ హోమ్, బాల సదనమును సందర్శించారు. వసతులను పరిశీలించారు. న్యాయవాదిని నియమించుకోలేని వారికి ఉచితంగా న్యాయవాదిని పొందడం వారి హక్కు అని తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అందిస్తున్న సేవల గురించి వివరించారు. వసతిగృహాల్లో ఎటువంటి సమస్యలున్నా, ఎటువంటి న్యాయ సాయం కావాలన్నా జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు తెలియజేయాలన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి శ్రీలక్ష్మి

అన్నదాతలకు శాస్త్రవేత్తల సూచనలు

ప్రజాశక్తి - కడియం

కడియం మండలంలో సాగుబడిలో ఉన్న దాళ్వా వరి పంట ఆరోగ్యంగా, చిరు పొట్ట దశలో ఉందని,చివరి ఎరువుల మోతాదులో భాగంగా ఎకరాకు 50 కిలోల యూరియా, 20 కిలోల మ్యూరియేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవాలని జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ చల్లా వెంకటనరసింహారావు, డాక్టర్ మానుకొండ శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని మురముండలో వ్యవసాయ అధికారి కె.ద్వారకదేవి సమక్షంలో మంగళవారం జరిగిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో శాస్త్రవేత్తలు పాల్గొని అన్నదాతలకు పలు సూచనలు చేశారు. వారు మాట్లాడుతూ దాళ్వా వరి పంట మండలంలో పిలక దశ నుంచి అంకురం దశలో ఉందన్నారు. పంటలను చీడపీడలు తక్కువగా ఆశించాయన్నారు. దిగుబడి ఆశాజనకంగా ఉంటుందన్నారు. కొన్ని ప్రాంతాల్లో వరికి మచ్చ తెగులు ఆశించి, పైరు పసుపు రంగుకి మారిందన్నారు. నివారణకు జినేబ్ (జెడ్ -78) 2గ్రా. లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. శాస్త్రవేత్తల వ్యవసాయ అధికారుల సూచనల మేరకు మెలకువలు పాటించి, ఈ దాళ్వాలో అధిక దిగుబడి సాధించాలన్నారు. ఈ సందర్భంగా ఏవో ద్వారకదేవి రైతు రిజిస్ట్రేషన్ కార్యక్రమం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.



వరి పొలాన్ని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

యాత్రికులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

మహాశివరాత్రి సందర్భంగా యాత్రికులు పుణ్యస్నానాలు చేయడానికి ఎటువంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని కమిషనరు కేతన్‌గార్గ్ తెలిపారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోనిసమావేశ మందిరంలో నగరపాలక సంస్థ అధికారులు పోలీస్, ఫైర్, ఫిషరీస్ తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని ఘాట్లను శుభ్రం చేయాలని, అవసరమైన చోట్ల ఇసుక వేయాలని, అలాగే ఘాట్లలో బారికేడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఘాట్లలో, ఘాట్ రోడ్లలోను సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని, ప్రస్తుతమున్న అన్ని కెమెరాలు పనిచేసేలా చూడాలన్నారు. ప్రతి ఘాట్లలోను రెండు షిఫ్టులలో గజఈతగాళ్లను 25వ తేదీ సాయంత్రం నుంచి 26వ తేదీ సాయంత్రం వరకూ ఏర్పాటు చేయాలని మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. స్నానమాచరించే మహిళా భక్తులు దుస్తులు మార్చుకునేందుకు తాత్కాలిక స్నానపు గదులు ఏర్పాటు చేయాలన్నారు. నీటిలో దిగలేని వారికి, పిల్లలకు పైనే స్నానమాచరించడానికి షవర్ బాత్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పుష్కర్‌ఘాట్, కోటిలింగాలపేట రేవుల్లో ఫైర్ ఇంజిన్, అంబులెన్స్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనరు పివి.రామలింగేశ్వర్, సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.పాండురంగారావు, డిప్యూటి కమిషనర్ ఎస్.వెంకటరమణ, మున్సిపల్ ఆరోగ్య అధికారి డాక్టర్ ఎ.వినూత్న, సిటీ ప్లానరు జి.కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో జాతీయ కార్యశాల

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం ప్రభుత్వ అటానమస్ కళాశాలలో స్కిల్ ట్రైనింగ్ సెంటర్, మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో రైజ్ అండ్ షైన్ అనే అంశంపై మంగళవారం ఒకరోజు జాతీయ కార్యశాలను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర ప్రారంభించారు. ఈ సదస్సులో విద్యార్థులకు గోల్ సెట్టింగ్ కెరీర్ ఆపర్చునిటీస్ అనే అంశాలపై చర్చించారు. మాజీ బ్యాంక్ మేనేజర్ అయ్యగారి శ్రీనివాసులు ఛీఫ్ గెస్ట్‌గా హాజరై మాటాల్డఆరు. విద్యార్థినులకు ల్యాప్‌ట్యాప్‌లను అందించారు. రోటరీ క్లబ్ ఆఫ్ రివర్సిటీ రాజమండ్రి వారు మహిళా సాధికారత విభాగానికి శానిటరీ నాప్కిన్ వెండింగ్ మిషన్‌ను అందించారు. మహిళా సాధికారత విభాగం తరపున విద్యార్థులకు లక్ష రూపాయలు వస్తు రూపేనా సాయం చేశారు. ముఖ్య వ క్తులుగా అయ్యగారి శ్రీనివాసరావు, డాక్టర్ అనసూరి ప్రియాంక మాట్లాడారు. భాస్కర్, ధనరాజ్ అర్థమెటిక్, రీజనింగ్, ఇంటర్వ్యూ స్కిల్స్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్కిల్ ట్రైనింగ్ సెంటర్, జాతీయ కార్యశాల కోఆర్డినేటర్ బి.వెంకట్రావు, మహిళా సాధికారత కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.సురేఖ, బి.దుర్గాలక్ష్మి, బి.భవాని, అంజనీకుమారి ఇతర మహిళ అధ్యాపకులు పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపిపి ప్రసాద్

డాక్టర్ రమాదేవి సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - కడియం

ఇప్పటి వరకు నాలుగు వేలకు పైగా లాప్రోస్కోపి, వేలాది గర్భ సంబంధిత ఆపరేషన్లను ఉచితంగా చేసిన అనపర్తి రమాదేవి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యురాలు డాక్టర్ రమాదేవి సేవలు అభినందనీయమని కడియం ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్ అన్నారు. మంగళవారం కడియం పంచాయతీ ఆవరణలో స్థానిక వెలుగుబంటి రామచంద్రరావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి ప్రసాద్ మాట్లాడుతూ డాక్టర్ రమాదేవి పేదల కోసం ఎటువంటి ఫీజు లేకుండా కేవలం మందుల ఖర్చుల తోనే వేలాది మందికి శస్త్ర చికిత్సలు నిర్వహించడం అభినందనీయన్నారు. ఈ వైద్య శిబిరంలో రోగులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహిచి ఉచితంగా మందులు అందించారు. అలానే అవసరమైన వారికి అనపర్తిలో తమ ఆసుపత్రి నందు ఉచితంగా స్కానింగ్, సర్జరీ నిర్వహిస్తామని డాక్టర్ రమాదేవి తెలిపారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - ఏలేశ్వరం, ప్రత్తిపాడు

ఈనెల 20న విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే ఆంధ్రప్రదేశ్ విద్యుత్ మీటర్ రీడర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రథమ మహాసభను జయప్రదం చేయాలని సంఘం అధ్యక్షుడు పసగడుగుల నానాజీ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఎపి ట్రాన్స్‌కో కార్యాలయం వద్ద మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా నానాజీ మాట్లాడుతూ ప్రభుత్వాలు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు చేయడం వల్ల వినియోగదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. స్మార్ట్ మీటర్ వినియోగంలో అవకతవకలు చోటు చేసుకుంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఉగ్గిన సతీష్, కోశాధికారి బీరా శ్రీను, నాయకులు పసగడుగుల నూకరాజు, పైల చిన్ని, ఎస్‌కె.అలీషా, కె.దుర్గా, ఎం.సంజయ్, సిహెచ్.లక్ష్మణ్, ఎ.అశోక్, ఎం.రాజేష్ పాల్గొన్నారు. అలాగే ప్రత్తిపాడు విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రకాష్‌రావు మాట్లాడుతూ మీటర్ రీడర్స్ ఎన్నో ఏళ్ల నుంచి చాలీచాలని జీతాలతో ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఈనెల 20న విజయవాడలో జరిగే యూనియన్ మహాసభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పసగొడుగుల నానాజీ, శ్రీను, పసగొడుగుల నూకరాజు, ఏసుబాబు, వినోద్ పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

ఎన్‌సిడి సర్వేను సంపూర్ణంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

కేన్సర్ గుర్తింపు కోసం నిర్వహిస్తున్న ఎన్‌సిడి సర్వేను సంపూర్ణంగా నిర్వహించాలని డిఎంహెచ్ఒ డాక్టర్ నరసింహ నాయక్ ఆదేశించారు. మంగళవారం మండలంలోని గోరింట గ్రామంలో నిర్వహించిన ఎన్‌సిడి సర్వేని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రకాల కేన్సర్ల గుర్తింపు కోసం నిర్వహిస్తున్న ఈ సర్వేతో కేన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించవచ్చన్నారు. సర్వే వల్ల జరిగే ఉపయోగాలపై పూర్తిస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సర్వే నిర్వహణ జరిగిన విధానాలు, సర్వే నిర్వహణలో సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ డాక్టర్ ప్రభాకర్, పులిమేరు పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ శ్రావణి, మల్లాం, పులిమేరు పిహెచ్‌సిల సూపర్‌వైజర్లు భద్రం, సురేష్, పాల్గొన్నారు.



సర్వే వివరాలను అడిగి తెలుసుకుంటున్న డిఎంహెచ్ఒ

బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - సామర్లకోట

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'ఈ శ్రమం' ఉచిత బీమా పథకాన్ని కార్మికులు, కర్షకులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా లేబర్ అధికారి రవిశంకర్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక బ్రౌన్‌పేట అంబేద్కర్ కాలానీలో వాక్ విత్ క్రైస్ట్ చర్చ్‌లో పాస్టర్ పి.ఆనంద్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ శ్రమం నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు రోజులుగా 'ఈ శ్రమం' ఉచిత ఇన్సూరెన్స్ పథకానికి నమోదు ప్రక్రియ జరుగుతుందన్నారు. బుధవారం కూడా ఈ కార్యక్రమం జరుగుతుందని, తెల్ల రేషన్ కార్డు ఉండి 60 సంవత్సరాల లోపు ఉన్న కార్మికులు ఈ శ్రమంలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

యానిమేటర్‌పై విచారణ

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని చందుర్తి గ్రామంలో డ్వాక్రా యానిమేటర్‌పై వచ్చిన ఫిర్యాదుపై జిల్లా ప్రాజెక్టు మేనేజర్ బాబూరావు విచారణ నిర్వహించారు. గతంలో యానిమేటర్‌గా పనిచేసిన చీకట్ల కుమారిని తొలగించి ఆమె స్థానంలో మాసరపు పద్మను గ్రామ సంఘం, అధికారులు గత అక్టోబర్ నెలలో నియమించారు. అయితే చీకట్లో కుమారి నన్ను అన్యాయంగా తొలగించారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో గ్రామసభ ఏర్పాటు చేసి విచారణ చేపట్టారు. మెజార్టీ సభ్యులు యానిమేటర్‌ను మార్చాలని ఈ సమావేశంలో వివరించారు. ఈ కార్యక్రమంలో మండల ఎటిఎం సన్యాసిరావు, సిబ్బంది, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

లారీలను అడ్డుకున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని రాయ భూపాలపట్నం రాగమ్మ చెరువు సమీపంలోని శిథిల వంతెన వద్ద అధిక లోడుతో వెళుతున్న లారీలను టిడిపి నాయకులు మంగళవారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలోని చిన్న బ్రహ్మదేవం గ్రామంలో ఉన్న కెబికె పరిశ్రమ నుంచి అధిక లోడుతో లారీలు తరచుగా తిరుగుతున్నాయని, దీనివల్ల శిథిలవంతెన కూలిపోయే ప్రమాదం ఉందన్నారు. వాహనాలను ఇతర రహదారి మీదుగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మన్యం ప్రసన్న, కల్తూరి శ్రీను, సానిపిని సురేష్, నల్లల శ్రీను, ప్రజలు పాల్గొన్నారు.

'శ్రీ మహతి' విద్యార్థులకు యంగ్ జీనియస్ అవార్డులు

ప్రజాశక్తి - సీతానగరం

శ్రీ మహతి విద్యాసంస్థల విద్యార్థులు సర్ సివి.రామన్ యంగ్ జీనియస్ అవార్డులను అందుకున్నారు. ఐఐటిలో స్టేట్ ర్యాంకులు సాధించిన చేకూరి అశ్వద్ వర్మ, ఆకుల మోహన్ వీరేంద్ర హైదరాబాద్‌లోని లలిత కళా తోరణంలో ఈ నెల 16న జరిగిన కార్యక్రమంలో ప్రముఖ సినీ నటుడు రావు రమేష్, తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. అనంతరం ఘనంగా సత్కరించారని కరస్పాండెంట్ ఎ.శ్రీనివాస్ తెలిపారు. వరుసగా 8వసారి తమ విద్యార్థులు స్టేట్ ర్యాంకులు సాధించారన్నారు. ప్రత్యేక ప్రణాళిక ద్వారా ఈ విజయాలు సాధించామని ఐఐటి అకడమిక్ డైరెక్టర్ ఎఎస్.రాంప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సివి.రామన్ ఫౌండర్ డాక్టర్ వై.కిరోన్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయంసాధించిన విద్యార్థులను, స్టాఫ్ ప్రత్యేకంగా అభినంధించారు.



అవార్డు అందుకుంటున్న శ్రీమహతి విద్యార్థి

ఘనంగా ఆంగ్ల భాషా దినోత్సవం

ప్రజాశక్తి- కడియం

కడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల భాషా దినోత్సవాన్ని ఆంగ్ల ఉపాధ్యాయులు బూసి సువర్ణ వేణి, కర్రి రాజు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఇఒ మణికుమార్ హాజరయ్యారు. ఆంగ్ల భాష గొప్పతనం, నేటి ఆధునిక యుగంలో దాని ప్రాధాన్యత గురించి వివరించారు. హెచ్‌ఎం టి.సత్యనారాయణ మాట్లాడుతూ ఆంగ్ల భాష నేర్చుకుంటే ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గొల్లపల్లి సత్యనారాయణ, రఫీనుద్దీన్, కిరీటి, సతీష్, డేవిడ్, లీలావతి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

పెరవలి : మండలంలోని కాకరపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఇంగ్లీష్ భాషా దినోత్సవాన్ని ప్రధానోపాధ్యాయులు శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఇంగ్లీషు భాష ఆవశ్యకతను వివరించారు. పిల్లలతో ఇంగ్లీషు చదవించడం, రాయించడం తదితర కృత్యాలు చేయించారు. ఈ కార్యక్రమంలో ఇంగ్లీష్ ఉపాధ్యాయులు ప్రశాంతి, శశికళ, పీడీ సుందర్‌జేమ్స్, ఇతర ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు

అచ్చుతాపురం సచివాలయంలో తనిఖీలు

గోకవరం : మండలంలోని అచ్చుతాపురం సచివాలయంలో మంగళవారం డిఎల్‌పిఒ ఎం.నాగలత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగలత మాట్లాడుతూ ఇటీవల అచ్చుతాపురం గ్రామంలో కలెక్టర్ ఇంకుడు గుంతలు నిర్మాణ పనులను ప్రారంభించారన్నారు. దీనిలో భాగంగానే గ్రామ సచివాలయంను సందర్శించి ఇంటి పన్నులు వసూలు రిజిస్టర్లను తనిఖీ చేశారన్నారు. అతి తక్కువ శాతం వసూళ్లు ఉండడంతో సచివాలయాన్ని తనిఖీ చేశామన్నారు. ఇంటి పన్నులు వసూళ్లు నూటికి నూరు శాతం ఫిబ్రవరి నెలాకరుకు వసూలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే నూతన గృహాలకు కొలతలు ప్రకారం ఇంటి పన్నులు వేసి వసూలు చేయాలన్నారు. అనంతరం సచివాలయంలో వివిధ రకాల రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి ఎం.రాజేశ్వరరావు, కార్యదర్శులు గోపన్న దొర, ప్రణవ్ సిబ్బంది పాల్గొన్నారు.